క్లుప్తంగా

ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు

దుమ్ముగూడెం: పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ కార్యాచరణలో దశల వారి ఆందోళనలో భాగంగా మండల పంచాయతీ కార్యదర్శులు సోమవారం ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖలు పోస్ట్ చేశారు.4 సంవత్సరాల ప్రొబేషన్ కాలం పూర్తైన నేపథ్యంలో ఈ 4 సంవత్సరాల కాలన్ని సర్వీస్ కాలంగా గుర్తిస్తూ జేపీఎస్ ఉద్యోగులను క్రమమద్ధీకరించాలని, టీపీఎస్‌లను జేపీఎస్‌లుగా గుర్తించాలని కోరుతూ లేఖలు రాశారు. మండలంలోని 32 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

అశ్వారావుపేటరూరల్: తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 28వ తేదీ నుంచి నిరావధిక సమ్మె చేస్తున్నట్లు స్థానిక పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు సోమవారం సమ్మె నోటీస్ అందించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులంతా నిరసన వ్యక్తం చేసి, ఆ తర్వాత డీటీ సుచరితకు సమ్మె నోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నాలుగేళ్ల ప్రొబేషనరీ గడువు ముగిసినప్పటికి నేటికీ తమను రెగ్యులర్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం లేదన్నారు. పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు కార్తీక్, శ్యాం, మోతీలాల్, స్పందన, అలివేలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

భద్రాచలంఅర్బన్: గత సంవత్సరం ఉపాధి పనులు చేసిన కూలీలకు చెల్లించవలసిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, భద్రాచలం పంచాయతీ పరిధిలో ఉపాధి కూలీలకు కొత్తగా పనులు చూపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం స్వామి డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ కార్యక్రమం సందర్భంగా జరిగిన గ్రామసభలో ఆయన అధికారులకు వినతిపత్రం అందించి మాట్లాడారు. తక్షణమే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మండల స్పెషల్ అధికారి నాగలక్ష్మి, పంచాయతీ ఈఓ వెంకటేశ్వరరావులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉపాధి కూలీలు తూము రాధా, జ్యోతి, రమణ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' ప్రారంభం

దుమ్ముగూడెం: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రగళ్లపల్లి సర్పంచ్ జుంజురి లక్ష్మి అన్నారు.సోమవారం ప్రగళ్లపల్లి పంచాయతీలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆమె రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు పంచాయతీలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ములకపాడు డాక్టర్ పుల్లారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి,గ్రామస్తులు జయసింహా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భూ పండుగ

అశ్వారావుపేటరూరల్: మండల పరిధిలోని తిరుమలకుంట కాలనీ గ్రామంలో సోమవారం ఆదివాసీ గిరిజనులు భూమి పండుగ సంబురాలను ఘనంగా జరుపుకున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ సంబరాల్లో భాగంగా తొలి రోజు గిరిజనులంతా కలిసి నాగలికి కట్టే తాళ్లు, ముల్లకర్ర, నవ ధాన్యాలతో ప్రత్యేక పూజలు చేసి, ఆ తర్వాత సామూహిక భోజనాలు చేశారు. అనంతరం ఆదివాసీల ఆచారం ప్రకారం కొంతమంది గ్రామస్తులు సమీప అటవీ ప్రాంతానికి విల్లంబులతో వేటకు వెళ్లారు. ఐదు రోజుల ప్రత్యేక పూజలు ముగిసిన తర్వాత వ్యవసాయ పనులు మొదలు పెట్టడం వారి పూర్వీకుల నుంచి వస్తున్న ఆనవాయితీ.

మాజీ ఎమ్మెల్యే పర్యటన

పినపాక: మండల పరిధిలోని ఈ బయ్యారం గ్రామంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విస్తృతంగా పర్యటించారు. దేవి రెడ్డి రోషిరెడ్డి దశదినకర్మలకు హాజరై కుటుంబ సభ్యులకి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుందురు సీతమ్మ అనారోగ్యంతో మృతి చెందగా వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్న ఓ దినపత్రిక రిపోర్టర్ సనప భరత్‌ను ఆయన పరామర్శించారు. వారితో మాట్లాడి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కరకురాములో ఉడుముల లక్ష్మీరెడ్డి, రవీందర్ రెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, కొమరం రాములు, నవత శ్రీను పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన నాయకులు

మణుగూరుటౌన్: డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్)ను హైదరాబాద్‌లో సోమవారం కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు రసూరి శంకర్ వివరాలు వెల్లడిస్తూ.. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులకు హైపవర్ వేతనాలు జీఓ నెంబర్ 60 ప్రకారం ఇతర సౌకర్యాలు చెల్లించాలని కోరినట్లు తెలిపారు. డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాస్, ఏఎల్‌సీ మహేష్, కాంట్రాక్టు కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం మణుగూరు ఏరియా ఉపాధ్యాక్షుడు వరదల సమ్మయ్యలు పాల్గొన్నారు.

పల్లెల్లో గాలివాన బీభత్సం

- కూలిన విద్యుత్ స్తంభాలు.. విరిగిన చెట్లు
- ధాన్యం తడవడంతో రైతుల ఆందోళన



ద్విచక్ర వాహనంపై విరిగిపడ్డ చెట్టు



కరకగూడెంలో గాలివానకు నేలవాలిన వరిచేను



ఎగిరిపోయిన రేకులు

కరకగూడెం: మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. మండల కేంద్రంతో పాటు పద్మాపురం, అనంతారం గ్రామాల మధ్య విద్యుత్ స్తంభాలు కూలి రోడ్డుమీద పడిపోయాయి. అలాగే పలు చోట్ల పెద్దపెద్ద వృక్షాలు సైతం నేలవాలాయి. దీంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం వాటిల్లింది.

సోమవారం విద్యుత్ శాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. మరోవైపు గాలివానతో మండల కేంద్రంలోని ఓ ఇంటి ఆవరణలోని చెట్టు విరిగి ద్విచక్రవాహనంపై పడిపోయింది. పలువురి ఇంటిపైకప్పులుగా ఉన్న రేకులు గాలికి ఎగిరిపడడంతో వినియోగానికి పనికిరాకుండా పోయాయి. కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం గాలివానకు తడిసిముద్దాయింది. చేతికొచ్చిన పంట ఇలా వాన పాలు కావడంతో అన్నదాతలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

చదువులకు సింగరేణి ప్రోత్సాహం

మణుగూరుటౌన్: సింగరేణి సంస్థ కార్మికులు ఉద్యోగుల పిల్లల ఉన్నత చదువులకోసం నిరంతరం ప్రోత్సాహం అందిస్తుందని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ తెలిపారు. సోమవారం మణుగూరు ఏరియాలోని పీకేఓసీ–2లో పోర్‌మెన్ ఇన్‌చార్జ్ విధులు నిర్వహిస్తున్న గాలం రామకృష్ణ కుమారుడు గాలం సాయిరోహిత్ ఐఐటీలో కేరళలో చేస్తున్నాడు. అతనికి సింగరేణి సంస్థ పోత్సాహకంగా ప్రతి ఏడాది రూ.1లక్ష అందజేయడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన చెక్కును గాలం రామకృష్ణకు ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అందజేశారు. సింగరేణి సంస్థ అత్యుత్తమ ప్రతిభ చాటుతున్న సింగేణీయుల పిల్లల చదువుకు మరింత ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఎస్వోటూ జీఎం డి.లలిత్‌కుమార్, ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, ఏరియా ఇంజనీర్ ఎం.నర్సిరెడ్డి, టీబీజీకేఎస్ నాయకుడు వి.ప్రభాకర్‌రావులు పాల్గొన్నారు.



ప్రోత్సాహక బహుతిగా చెక్కు అందజేస్తున్న జీఎం రాంచందర్

ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లిష్ ల్యాబ్

మణుగూరుటౌన్: మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఇంగ్లిష్ ల్యాబ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంగ్లభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు దీనిని వినియోగించుకుని ఆంగ్లభాషా ప్రావీణ్యతను పెంపొందించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆంగ్ల అధ్యాపకుడు బూర్గుల సతీష్, అధ్యాపకులు డాక్టర్ అనురాద, రామ తిరుపతి, ఖరీం, నరేష్‌లు పాల్గొన్నారు.

సమ్మె చేస్తే కఠిన చర్యలు

అశ్వారావుపేటరూరల్: ఆర్టిజన్లు సమ్మెల్లో పాల్గొంటే సర్వీసు నిబంధనలు ప్రకారం కఠిన చర్యలు తప్పవని సోమవారం అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏడీ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 15వ తేదీ నాటికి విద్యుత్ కార్మిక సంఘాలతో వేతన సవరణ ఒప్పందం ముగిసిందని, విద్యుత్ సంస్థల్లో సమ్మె నిషేధం అమలుల్లో ఉందని గుర్తు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలకు బాధ్యులైన వారిని ఉపేక్షించేదిలేదన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

అశ్వారావుపేటరూరల్: బీఆర్‌ఎస్ పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశాన్ని నేడు(మంగళవారం) నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శి బండి పుల్లారావు, జె.వెంకన్న తెలిపారు. స్థానిక పామాయిల్ తోటలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, ఆత్మీయ సమావేశాన్ని అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలు తరలి రావాలని ఈ సందర్భంగా వారు కోరారు.

వచ్చే నెల 5న తిరుకల్యాణోత్సవం

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వచ్చే నెల 5వ తేదీన స్వామి వారి వార్షిక తిరుకల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎల్.రమాదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. కల్యాణంలో పాల్గొనటానికి ఆసక్తి ఉన్న భక్తులు రూ.1500 లను చెల్లించి పాల్గొనవచ్చని తెలిపారు.

వృద్ధులకు అన్నదానం

మణుగూరురూరల్: సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం అమ్మనాన్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి మండల కన్వీనర్ సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. అనాథ వృద్ధులను చేరదీసి వారికి సేవలు చేస్తున్న వృద్ధాశ్రమ నిర్వాహకులు తార ప్రసాద్ కుటుంబ సభ్యులను అభినందించారు. సాయిబాబా సేవా సమితి సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతను నిర్మించుకోవాలి

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామ పంచాయతీ లైట్ హౌస్ గ్రామ పంచాయతీగా ఎంపికైనందున జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీలో ఇంకుడు గుంత, మరుగుదొడ్డి లేని వారందరూ తక్షణమే నిర్మించుకోవాలని సర్పంచ్ మర్రి మల్లారెడ్డి కోరారు. మొండికుంట గ్రామంలో ఇళ్లల్లో ఇంకుడుగుంతల నిర్మాణాలకు మండల అధికారులతో కలిసి సోమవారం సర్పంచ్ మల్లారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఇంట్లో ఇంకుడు గుంత నిర్మించుకుంటే వారికి ప్రభుత్వం రూ.6400 చెల్లిస్తుందన్నారు. మరుగుదోడ్లు లేని వారికి మరుగుదొడ్లు మంజూరైనందున వెంటనే నిర్మించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, ఎంపీఓ శ్రీనివాస్, ఏపీఓ సీతరామయ్య, ఉపసర్పంచ్ సుధీర్, కార్యదర్శి సైదులు, ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి వీడ్కోలు సన్మానం



న్యాయమూర్తి చంద్రశేఖర్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

భద్రాచలంఅర్బన్: కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, లీగల్ సర్వీస్ అథార్టీ చైర్మన్ పసుపులేటి చంద్రశేఖర్ ప్రసాద్ బదిలీ అయి మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తిగా నియమిస్తూ ఇటీవలే హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. దీంతో సోమవారం న్యాయమూర్తి చంద్రశేఖర్ ప్రసాద్‌ను భద్రాచలం న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కోట దేవదానం, కార్యవర్గ సభ్యులు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కోట మాట్లాడుతూ.. జిల్లా న్యాయమూర్తిగా బాధ్యత చేపట్టిన అతి తక్కువ కాలంలోనే జిల్లా కోర్టు ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారని, లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ చైర్మన్‌గా లోక్ అదాలత్‌లు నిర్వహించి వేల సంఖ్యలో కేసులు పరిష్కరించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాస చారి, సున్నం రమేష్, సాధనపల్లి సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

కరకగూడెం: సమాజంలోని నిరుపేదలకు ప్రతి ఒక్కరూ సేవచేయాలనే ఆలోచన రావాలని, అలాంటి సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని కరకగూడెం ఎస్సై జీవన్ రాజ్ అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం 'ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రబాద్'సభ్యులు, గ్రామీణ వైద్యులు ఎస్‌కె.సోందు పాషా ఆధ్వర్యంలో మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన నిమ్మగూడెం గ్రామస్తులకు ఎస్సై చేతుల మీదుగా సుమారు 60 దోమతెరలను పంపిణీ చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు ప్రణాళిక

కరకగూడెం: వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా గ్రామాల వారిగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించినట్లు కరకగూడెం ఎంపీపీ రేగా కాళిక అన్నారు.

ఈ మేరకు ఆమె సోమవారం రేగళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిమొదలు గ్రామం నుండి పడిగాపురం గ్రామం వరకు సుమారు రూ. 3లక్షల రూపాయల మండల పరిషత్ నిధులతో చేపట్టిన పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కుంజ వసంతరావు, పాఠశాల హెచ్‌ఎం జ్యోష్ణ దేవి, ఉపాధ్యాయుడు అశోక్, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రావుల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ రేగా కాళిక

ప్రజా సమస్యలను పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి కనకయ్య

మణుగూరురూరల్: బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రచారాలు చేయడం మాని.. ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు. ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ వారు ప్రచారాలు చేస్తూ..ప్రజా సమస్యలను విస్మరిస్తున్నారని విమర్శించారు. చికాగో అమరవీరుల స్ఫూర్తితో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఏజే రమేష్, సీనియర్ నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కొడిశాల రాములు, లెనిన్ బాబు, నరసింహారావు, సాంబశివరావు, లక్ష్మణరావు, నాగమణి, నాగలక్ష్మి, పద్మ, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

పినపాక: తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. సోమవారం ఈ బయ్యారం క్రాస్ రోడ్‌లోని జీఆర్ ఫంక్షన్ హాల్లో టీఏజీఎస్ మండల అధ్యక్షుడు దుబ్బా గోవర్ధన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలో మే 5 తేదీన జరిగే గిరిజన సంఘం మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఏజే.రమేష్, మండల కన్వీనర్ నిమ్మల వెంకన్న, రమేష్, నట్టి శంకరయ్య, కల్తి వెంకటేశ్వర్లు, పాండురంగాపురం సర్పంచ్ ఈసం భవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కార్యాచరణ

బూర్గంపాడు: మారుమూల ఆదివాసీ గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తామని ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. సారపాకకు సమీపంలోని అటవీగ్రామం చంద్రయ్యగుంపును సోమవారం ఆయన సందర్శించారు. గ్రామస్తులతో కలసి గ్రామమంతా పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారుల అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరగా పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అటవీ ప్రాంతంలోని గ్రామాల్లో మౌలికవసతుల కల్పనకు కొన్ని ఇబ్బందులున్నాయని, అయినప్పటికీ వాటిని అధిగమించి అభివృద్ధి చేస్తామన్నారు. చంద్రయ్యగుంపు గ్రామస్తులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం బూర్గంపాడు తహసీల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన కంటె రామకృష్ణ మృతిచెందటంలో ఆయన కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. సంజీవరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సోము సుబ్బలక్ష్మి, రెడ్డిపాలెంకు చెందిన బొల్లినేని రామయ్య ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్ భగవాన్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, మార్కెట్‌కమిటీ చైర్మన్ పొడియం ముత్యాలమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గోపిరెడ్డి రమణారెడ్డి, జలగం జగదీష్, జక్కం సుబ్రహ్మణ్యం, కొనకంచి శ్రీనివాస్, వల్లూరిపల్లి వంశీకృష్ణ పాల్గొన్నారు.



చంద్రయ్యగుంపు గ్రామంలో పర్యటిస్తున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

ఏర్పాట్ల పరిశీలన..

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటిశాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని చేస్తున్న ప్లీనరీ సమావేశ ఏర్పాట్లను ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సోమవారం పరిశీలించారు. ఏర్పాట్లపై నిర్వాహణ కమిటీకి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. నేటి ఉదయం 10 గంటల నుంచి జరిగే పార్టీ ప్లీనరీ సమావేశానికి నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు జెడ్పీటీసీ పోశం నరసింహారావు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీటీ రోడ్డుకు శంకుస్థాపన

దమ్మపేట: మండల పరిధిలోని బొగ్గంరాజులగుంపు నుంచి లింగాలపల్లి గ్రామానికి వెళ్లే మార్గానికి మంజూరైన బీటీ రోడ్డు నిర్మాణ పనులకు స్థానిక ఎమ్మెల్యే మెచ్చా శంకుస్థాపన చేశారు. ఆదివారం శంకుస్థాపన కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులతో కలసి కొబ్బరికాయ కొట్టి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గ్రామస్తులకు ఇచ్చిన హామీ మేరకు కోటి 90 లక్షల రూపాయలతో బీటీ రోడ్డును మంజూరు చేయించి, ప్రారంభించామని పేర్కొన్నారు.

రోడ్డు మంజూరు చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, కొయ్యల అచ్యుతరావు, సర్పంచ్ వాడే జయ, లక్ష్మి, సున్నం రాము, బీఆర్‌ఎస్ నాయకులు దారా యుగంధర్, సోయం రాజు, మన్నెం అప్పారావు, గండికోట లక్ష్మణ్‌రావు, జిన్నా పాల్గొన్నారు.



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

పాఠశాలలో సమావేశం



సన్మానం అందుకున్న దాతలు..

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం పాఠశాల హెచ్‌ఎం మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. పాఠశాలలో ఏడాది కాలంలో జరిగిన విద్యా ప్రగతిని హెచ్‌ఎం తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల ప్రగతి పత్రాలను విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. విద్యా కమిటీ చైర్మన్ సంపత్ మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభంలో గ్రామ పెద్దలను, తల్లిదండ్రులను కలిసి పాఠశాల అభివృద్ధికై విరాళాలను కోరగా రూ.1.30 లక్షలు సమీకరించామన్నారు. ఆ డబ్బుతో పాఠశాలకు రంగులు వేయడం, పూలమొక్కలు నాటడం, విద్యుత్ పరికరాలు కొనుగోలు వంటి తగిన సౌకర్యాలు కల్పించామన్నారు. పాఠశాల అభివృద్ధికి విరాళాల రూపంలో సహకరించిన పెద్దలను శాలువాలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ కాకా అశోక్, ఎస్ఎంసీ చైర్మన్ సంపత్, బొక్కా సాంబశివరెడ్డి, మొగిళ్ల లీలావతి, మొగిళ్ల చినవీరారెడ్డి, కొమిరెడ్డి పుల్లారెడ్డి, తుక్కాని రవితేజరెడ్డి, కొప్పుల పద్మ, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాలీకి తరలిన నాయకులు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య

భద్రాచలం: ఖమ్మంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన నిరుద్యోగ నిరసన ర్యాలీకు భద్రాచలం నియోజకవర్గం నుంచి ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లాయి. వీరి వాహనాలను డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య జెండా ఊపి ప్రారంభించారు. తరలి వెళ్లిన వారిలో టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సరెళ్ల నరేష్, పినపాక నియోజకవర్గ నాయకులు బట్ట విజయ్ గాంధీ,సరెళ్ళ వెంకటేష్, ఎడారి ప్రదీప్, చింతరేల సుధీర్, పిరునకి నవీన్, ఉబ్బ వేణు, కొత్త శ్రీను, పిలక వెంకటరమణారెడ్డి, భజన సతీష్, బర్ల నాగమణి తదితరులు ఉన్నారు.

మణుగూరురూరల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పిలుపుమేరకు ఖమ్మంలో యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చలో ఖమ్మం పేరిట చేపట్టిన నిరుద్యోగ నిరసన ర్యాలీకి మణుగూరు మండలం నుంచి కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం బస్సులో తరలివెళ్లారు. ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు గురిజాల గోపి జెండా ఊపి ప్రారంభించారు. నాయకులు పాపారావు, నూరుద్దీన్,సాంబశివరావు, లక్ష్మణ్, కిరణ్ మోహన్, కిషన్, రవి, మనోజ్, సందీప్ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మంలో జరిగిన నిరుద్యోగ నిరసన ర్యాలీ సభకు సోమవారం అశ్వారావుపేట మండలం నుంచి ఆ పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల నుంచి ఆ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలంతా ఆర్టీసీ బస్సులు, కార్లలో ఖమ్మం వెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సుంకవల్లి వీరభద్రం, మాజీ జెడ్పీటీసీ సభ్యులు అంకత మల్లికార్జున్‌రావు, జ్యేష్ట సత్యనారాయణ చౌదరి, బండారు శ్రీనివాస్ ఉన్నారు.

ఒంటికాలిపై నిలబడి దీక్ష

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు చేపట్టిన దీక్ష సోమవారం 8వ రోజుకు చేరుకుంది. 8వ రోజున దీక్షలో ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. సమ్మె శిబిరాన్ని సందర్శించిన పలువురు నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వీఓఏల పట్ల మొండి వైఖరి ప్రదర్శిస్తోందన్నారు. వెంటనే వారికి రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సాధారణ, ఆరోగ్య బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



భద్రాచలంఅర్బన్: ఒంటి కాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న వీవోఏలు



బూర్గంపాడులో..



దుమ్ముగూడెంలో..